# ఇలవేలుపు

= శ్రీరామకృష్ణశాస్త్రి =

మనిషి మనిషిదీ ఓకతత్వం. మనిషి - మనిషికీ వేయిమంది మనుష్యుల పెట్టు స్వార్థం:

ఒకొక్కొక్క స్వార్థానికి..ఒకొక్కొక్క దేవుడు. ఆ ఒక్కడికే ఇలవేలుపు.

...నీకు అభిరుచులు మాటిమాటికీ మారుతూం టేనేగాని, జీవితంలో తగినంత రుచీ - పచీ అనుభ వించలేవు.

అనుక్షణమూ మారుతూండకపోతే, నీబ్రతుకు అదొక బ్రతుకేకాదు. కాని, నీదేవుడికి ఆస్వాతం త్ర్యములేదు...ఒక మాట...ఒక బాణం...ఒక పత్ని.

నీకు నెత్తిమీద దేవతగా...నీ తీరని కోరికలకు అమర్త్య - లక్షణాలు...నీకు అనువైనంతవరకూ ప్రసాదించి..నీదైవాన్ని ఒకరూపంగా మూటకట్టావు. అది నీవు ఎట్లా ఆడించితే అట్లా ఆడవలసిన కీలు బొమ్మ...

నీతప్పులన్నింటికీ పూటకాపు నీదైవం... కాని ఆ అభాజనుడు, పొరబాటునన్నా తప్పుచేస్తే... దండించకుండా దయతలచి విడిచిపెట్టిన పాపాన పోవు...

అసలు, నీతాళం తప్పింది: కాని, అడుగు తప్పు వేశాడని, చేతికి అందింది పుచ్చుకుని ఆ లేత కాలు విరిగేట్టు ఒక్కపెట్టు పెట్టావు ఆనాడు: కాని, అందరి పసిపిల్లలలాగా అయ్యో - మయ్యో అనేందుకు వీలులేదు ఆ అర్భకుడు. అలా కుంటుతూనే వ్యత్యస్త పాదారవిందుడుగా...నీవు ఆడమన్నట్టు ఆడితీరవల సిందే కాదా...తీర్థులూ...

దేవుడు దేవుండనగా దేవుం డా సీమనుండి దిగి వచ్చేనా?...ఎదుట ఉన్నవాడే పెళ్లికొడుకు...అని అమ్మవారిని పడకగదిలో బిగించి...అర్ధరాత్రివేళ అశ్వ మేధపర్వం పిండించి...నారాతే బ్రహ్మరాత అని రాజునూ, ప్రజలనూ బుకాయించిన మహానుభావుడవు నీవే కాదటయ్యా.

పక్కను జేరుక చెక్కిలినొక్కుచు చక్కగా సొక్కి యుండేవేళ...మీ ఆయనతో నను బ్రోవమని చెప్పవే అని అనుశాసించింది నీవేకావటయ్యా!... అంతఃపురంలో అణగి మణగి...ఆకాస్సేపైనా నీకు అందకుండా ఉందామన్నా, అక్కడైనా వాళ్లకు నీ అహంకారం, కడగండ్లు తప్పడంలేదు...కవీ, రవీ కానని చోట్ల సొంతు శోధించేందుకు ... నీవే తగిన మొనగాడవయ్యా!

ఔను, మరి. నీదేవుడు...కద్దన్నా, లేదన్నా ఆతడికి నీవే దిక్కు...మనుగడ.

నీదైవం కుయ్యాలించే దైవం. వాని తలదన్నిన వాడు - మరొకడు లేడు...

కాని... నీకూ నీదైవానికీ...గోవుకూ గోపాలు డికీ ఉన్న లంకె...ఈ అనుబంధం లేకపోతే, ఇద్దరూ ఉండరు...(అని నీకు తెలియదు.)

...ఇంతకూ, దేవుడూ మనిషివంటి వాడే నంటావా?...

*　　*　　*

ఇవన్నీ, మనం ఎవరమూ ఒప్పుకోని...ఒప్పుకో కూడని...సంగతులు.

—దేవుడూ మనిషివంటివాడే!

...ఉన్నమాట కాస్తా అనేస్తే, వాళ్లకన్న నిజానికి, మనకే ఉలుకు ఎక్కువ: ఎందుచేతనంటే, అది మన నిర్వ్యాహకత్వమాయెను!

దేవుడంటే...మనకు కోపం తెప్పించినప్పుడు శుద్ధదయ్యం!...పాపం, అది వట్టి నోరు-వాయ లేని పదార్థం: మనం తినమన్నప్పుడల్లా తినాలి: పెట్టిన నగలన్నీ మోయాలి: మన పవళింపు-సేవముచ్చటలన్నీ తీరిన తరువాత, అప్పుడు అమ్మవారిపక్కకు ఒత్తిగిలాలి: నిద్ర ఉన్నా లేకపోయినా, కోడి కూయకముందే, మళ్లీ మేలుకుని కూర్చోవాలి: అన్నింటికీ కిక్కురుమనకుండా, సహించి, రాయిలాగా...నల్లరాయిలాగా పడిఉండాలి: అలా ఉంటున్నా అద్దానికి ఒక్కొక్కనాడు చివాట్లు తప్పవు:

—ఎక్కడున్నాడయ్యా దేవుడు?—ఎక్కడా, మన నెత్తిమీద: నీవుకాని, నేనుకాని...దేవుణ్ణి ఇంకోచోట ఉండనియ్యం. నెత్తిన ఎక్కించుకు కూర్చుంటాము ఠంచన్ గా; అలుక వచ్చినప్పుడు ఎత్తికుదేసేందుకు వీలుగా-(ఆనుషంగికంగా ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాలి: సంప్రదాయసిద్ధంగా...నెత్తిన ఎక్కించుకున్నవాళ్లు ఎవరైనా దేవతలే: సర్వసాధారణంగా ఆగౌరవం పెళ్లాం అనే వస్తువుకు దక్కుతూంది. అయితే, పెళ్లాం దేవత అయినప్పుడు, తల్లి దయ్యం కావలసిన అగత్యం ఉన్నదా అంటే...ఆహాఁ, ఓవిధంగా, ఉన్నదనే చెప్పాలి. దేవతకూ-దయ్యానికీ ఉన్న అవినాభావసంబంధాన్నిబట్టి, దేవత-దయ్యం, ఏకకాలమందు తనపెళ్లాం కాలేనప్పుడు...తనపిల్లల తల్లి కాకపోతే, తన తల్లి అయినా దయ్యం అయితీరాలి అని సంప్రదాయం. లేకపోతే, తూకం బొటా-బొటిగా ఉండదు...ఇది యావత్తూ అప్రస్తుతం......)

* * *

—దేవుడులోంచి దేవతల్లోకి విస్తరించాము: ఇంత జనాభా ఎలా పెరిగిందయ్యా అంటే...నీ కులగోత్రాభివృద్ధినిబట్టి నీ యిలవేలుపులసంఖ్యకూడా వృద్ధిఅవుతూనేఉంటుంది: ఎవరి పంచె వారు కట్టుకున్నట్టు...ఎవరి చీరె వారు సింగారించుకున్నట్టు...ఎవరి దేవుడు వారికంటూ ఉండాలి: (అప్పుడప్పుడు, ముచ్చటకొద్దీ, వారిది వీరూ-వీరిది వారూ సింగారించుకున్నా, ఎల్లకాలమూ ఉంచుకునేందుకు వీలు లేదుకనుక ఎప్పుడోఅప్పుడు తిరిగి యిచ్చేసెయ్యాలి: ఇలా, వాడిక ఎక్కువకావడంలో కొందరు దేవతలు అరిగి-చిరిగి చివరకు ఎందుకూపనికిరాకుండా పోతారు: కొంతమంది పాతబడి, అట్టడుగున పడిపోతారు: ఎల్లకాలమూ చెక్కుచెదరకుండా మన్నే దేవతలు ఎందరో ఉండరు. ఇక ఉమ్మడివాటి సంగతా?...అది అంత గణుతించవలసిన విషయం కాదు.)—(మునుపు ముక్కోటిదేవతలు ఉండేవారు: ఆతరువాత, లోకం యావత్తూ, మన జనాభా ఎంతో పెరిగింది...మధ్యమధ్య ఎన్నో అవాంతరాలు వచ్చినవి: ఈ మధ్యనే అయిదారేళ్ల పాటు పెద్ద యుద్ధంకూడా జరిగి నేల కొంతమేర తెరిపి అయిందట: ఇవన్నీ పారజూసుకుని, ఇప్పుడు, ఆలెక్కను వాళ్ల సంఖ్య పెరిగిందో, విరిగిందో తేల్చుకోవాలి. అది, ఎవరో పనీపాటా లేనివాళ్లు తీరుబడిగా తిని కూర్చుని గుణకారం చేయవలసిన విషయం.)

* * *

ఎక్కడివాడయ్యా దేవుడు?—ఎక్కడ ఉంటాడయ్యా?

ఎవరిని అడిగినా, ఎవరికి వారు, ఎవరికి తోచినట్లు వారు...చెపుతారు. అయితే, ఒకరన్నమాట ఇంకొకరికి పొసగదు. 'ఎందెందు వెదకిచూచిన అందందే కలడు' అని, దత్తకొడుకు, వాళ్ల నాన్నతో మొరాయించాడు: కాని అంతకు పూర్వం, 'క్రోడంబై పినతండ్రిని కూల్చిన' సందర్భంలో, వాళ్ల నాన్న ముల్లోకాలూ గద బుజాన వేసుకుని గాలించి చూసినా ఎక్కడా కనబడలేదు. తిరిగి తిరిగి విసివి-వేసారి చివరకు, 'పోనీ, ఎవడో అనామకుడు' అని ఊరుకున్నాడు. హరి హరీ అంటూ యింట్లో పిల్లవాడు అహోరాత్రములూ అదేపనిగా పోరుపెడు

తూంటే...‘ ఈ సచరాచరములకు నధీశునాచు నేనుండగ, ఈసున (రామానుజపురవాసుడు)సర్వేశుడు, వా, డెవడురా? హరి అనువా డెవడురా?’ అంటూ నిజంగానే, తెలియక అడిగాడు: ‘తనయందు నిఖిల భూతములందు నొకభంగి, సమహితత్వంబున’ తన తమ్ముని నాశనంచేసిన ఉద్దండుడు ఉండగలడనే లౌక్యం అమాయకుడైన దానవాగ్రణి గ్రహించలేక పోయినాడు: అందువల్లనే, ప్రహ్లాదుని భక్తికి జడిసి, స్తంభంకడుపున పుట్టవలసిన ఇరకాటంలో పడ్డప్పుడు కూడా...వాళ్ల నాన్న ఎదుట నిజరూపంతో సాక్షాత్కరించేందుకు జంకాడు: కనుక, ప్రహ్లాదుని యిల వేలుపు ఆతడు వెదికినచోటల్లా...ఉండమన్న చోటల్లా కనబడ్డాడుకాని...వాళ్ల నాన్నకు అలా అందుబాటులో గోచరించలేదు...

ఎక్కడున్నాడయ్యా దేవుడు?—

‘కలడందురు దీనులయెడ...సకలయోగి గణములపాలన్...’

ఈ రెండుముక్కల్లోనూ పీసపాలుకూడా నిజం ఉండేందుకు వీలులేదు: దీనులకు దేవుడు ఇవ్వలేని వరం దైన్యం. అందుచేతనే, దీనులపాలిట ఎన్నడూ దేవుడు ఉండడు. వారు, దైవోపహతులైన భాగ్యశాలురు కాలేని అదృష్టవంతులుకదా!

ఇహ, యోగిగణముల విషయం...యోగులకు దైవసాక్షాత్కారం కలిగితే...ఉన్నంతలో వారు తరించి సిద్ధులుగా మారిపోతున్నారు: యోగులుగా నిలిచే యోగ్యత నశిసిపోతూన్నది. దహరాకాశపు పండువెన్నెలలో దాక్కొనేందుకు వెంపరలాడే దేవులనందరినీ తరిమివేసి అక్కడ అద్దంలాగా ఉంచుకోవడమే యోగం చేసే సాధన. ఆ పరగణా యావత్తూ దేవు డన్నదానికి ‘టాబూ’:

ఎక్కడున్నాడయ్యా దేవుడు?

ఎక్కడ లేడయ్యా?

—ఆమాటకు ఈమాట తెగులు. అంతటితో యీ మీమాంస ఆపూటకు...కట్టుబడుతుంది.

దేవుడు వెయ్యేళ్లూ వర్ధిల్లుతూంటాడా?—ఎబ్బే, అది ఎలా పొసుగుతుందయ్యా? వెయ్యేళ్లకూ నీకు ఎన్నేళ్లు ఆయుస్సో, నీదేవుడికీ అంతే కాదూ? ...నీవు పెట్టింది తిని, నీవు యిచ్చింది కట్టుకుని, ఉండమంటే ఉండి, ఊడమంటే ఊడి...సర్వకాలసర్వావస్థలయందూ, నీకు అక్రీతదాసుడుగా వెట్టిచాకిరీకి తేరగా కుదిరిన దేవుడికి.....నీవు ఊడగానే అంతటితో ఆ నౌకరీకూడా ఊడుతుంది. నీకు, అస్తమించిన అనంతరం, మరేత్రోవా లేకపోతే అధమం పంచభూతాలలో వీలైనంతవరకూ కలసిపోయే హక్కు అయినా ఉంది...కాని, నీదేవుడు నీలో సమాధిఅయిపోయినందువల్ల ... అక్కడితో ఆడనికి సమాప్తి...

ఏడాది కోసారైనా, ఆబ్దికంనాడు, ఎవరో ఒకరు నీవాళ్లు......నీసుగుణాలనీ (దుర్గుణాలనీ) నీకు యిష్టమైన ఆహార పదార్థాలనీ, తమకు రుచిగా, తలచుకుంటూరు. కాని, నీ తద్దినం నాడైనా నీదేవుడి పేరు చెప్పి వాళ్లు పట్టెడు పిండకూడు వెయ్యరు. కాకులూ, కచ్చికలూ, గంగిగోవుపాటి చెయ్యలేదు నీవుపోయిన తరువాత...నీదేవుడు.

నీదేవుడూ నీ అంతటి ‘అర్థాయుస్సు’ వాడేను!

నీదేవుడు...నాదేవుడు.

భక్తి కొద్దీ మనం వాళ్లని పెట్టే బాధలు పగవాళ్లకైనా వద్దు బాబూ.

నీ ఉమ్మసుకొద్దీ నీవు సర్కారు సొమ్మంతా ఖర్చుపెట్టి సంతర్పణలూ, సమారాధనలూ చేసి... చివరకు ఆరావచ్చేటప్పటికి, ఆబరువంతా నీదేవుడి నెత్తిన వేస్తే...పాపం ఆ అమానవుడు ఏ తిప్పలో పడి అర్ధరాత్రివేళ వచ్చి ముడుపు చెల్లించిపోవాలి!-అత్తగారి పోరుపుల్లు పడలేక అలసి సొలసి నీవు అలా భక్తిలోకి ఒరిగిపోతే నీదేవుడు, దక్కుస్తూ తన రూపు కూడా మాపుచేసుకుని, కంట్లో వత్తివేసుకుకూర్చుని యింటెడు బియ్యం పిండివిసిరిపొయ్యాలి...!—నీకు కాలునొచ్చినా చెయ్యినొచ్చినా నీదేవుడు, వణుకుతూంటూ ఊడిపడి నీకు దమ్మిడీఖర్చులేకుండా, చేత్తో తీసివేసినట్టు బాధ మటుమాయంచెయ్యాలి.

—ఏది చెయ్యమంటే అదల్లా చెయ్యాలి. ఎప్పుడు పిలిస్తే అప్పుడు పలికేట్టు ఉండాలి. నీవు తిడితే, దులిపేసుకుని పడిఉండాలి : నీకు అనుగ్రహం వచ్చి పిలిస్తే సంతోషంతో చంకలుకొట్టుకుంటూ, వచ్చి వాలాలి.

అంతే, ఏం చేస్తాం. ఆనుదుట మనం అల్లా వ్రాశాము...ఆ బ్రతుకు అల్లా వెళ్లమారవలసిందే!

ఇంట్లో-వంట్లో కట్టిపడేసుకున్న దేవుళ్ల సంగతి యింత లక్షణంగా ఉంది గనుక, ఇక, గుళ్లో స్తంభించి పోయిన రాయళ్లసంగతి ఆలోచిద్దామా ?—'యింటి కన్న గుడి పదిల'మనే సామెత యీ స్వరూపాలకు దేనికీ అనువర్తించదు : ఈ వాక్యానికి కర్త పూజారి :

పూజారి ఉన్నంతవరకూ ఆ దేవుడికి మైనారిటీ వెళ్లదు...ఏం వరం యివ్వబోయినా అది చెల్లదు ...ఎంత సంపాదనపరుడైనా...ఎంత ఆస్తిఉన్నా... ఏ దేవుడికీ కనీసపుహక్కులైనా లేవు :

కొందరి దేవుళ్లు...పగతీర్చుకునేందుకు బ్రతికుండగానే వాళ్ల కడుపున పుట్టి చేతనైనంతవరకూ పగ సాధించుతున్నారు. కాని, అందరికీ అలా తెగించడానికి భయంకాబోలు : వాళ్లకన్న పైఎత్తుగా... మళ్లీ వాళ్లకడుపున నీలాటి-నాలాటి రాలుగాయలు పుడితే ?—(దేవతల కడుపున దయ్యాలు పుట్టడమంటే...అందుకు యిదే హేతువు.)

యుద్ధానంతర పునర్నిర్మాణమంటూ ఇదో హటి, ఈ నడుమ ఎలాగూ రానేవచ్చింది కనుక... యీ సందర్భంలోనైనా...మన దేవుళ్లకు మనతో బాటు చతుర్విధస్వాతంత్ర్యములలో...పోనీ అన్నీ కాకపోయినా అధమం కొన్నైనా...అబ్బేట్టు చూడటం మనకు విధాయక మౌనా, కాదా ?

—'అన్నివిధాలా అణగీమణగీ పడిఉండని దేవుడు మాకు అసలే అక్కర్లే'దంటారా ?—అదీ మాబాగే!—దేవుడు బ్రదికిపోతాడు : కాని, నిరంకుశత్వం చెలాయించడమనేది మనకు యీనాటి పరిపాటా ?—మనం పుట్టకముందునుంచి మన తల్లికడుపున ఉంది. ఎవరో ఒకరు ఇంకొకరికి లోకువగా ఉండితీరాలి...ఏ మానవుడూ ఇకనుంచి...అట్లాంటిక్ ప్రణాళిక ననుసరించి — ఇంకొకడికి అడుగులకు మడుగులొత్తేందుకు వీలులేదు కనుక ... ఇహ, అడుగూ-బొడుగూ మిగిలింది ఎవరయ్యా ?—'ఎవరయ్యా లోకువ ?' — అంటే, నంబికొండాయ్ శిష్యుడు ... నీ దేవుడు !-నీ దేవుడు మనిషైనా కాడే, పాపం !

'నీ దేవుడేమిటి, నా దేవుడేమిటి...మనలాంటి భూతాలన్నింటా కలయదిరిగేవాడు ఒక్కడేసుమీ... అన్ని పేర్లకూ మూలపదార్థం శాశ్వతమైన ఆ మృత్తికే కదా' అని వాదానికి దిగుతావా?...సరే అలా త్రోవకురా...అందరి ఉమ్మడి ఉపయోగానికీ ఒక్కడే ఉంటే...మళ్లీ నీకు విడిగా వీడు ఎందుకూ...అది నీ 'అహం' ఔనా కాదా ?—ఇంకోమాట, కుమ్మరి ఒక్కసారి కుండచేసి దాన్ని ఆ రూపంలో తగుల బెట్టిన తరువాత...పగిలిపోతే, పనికిరాకపోతే... పారేస్తాడు కాని...మళ్లీ అసలు మట్టిలోకి మార్చేయగలడా ?—మన చేతుల్లో బడి...ఒక్కసారి పుటం వేసిన తరువాత...దానికి మళ్లీ తనలో కలిసిపోగల సత్తా...తగులడిపోయింది...ఔనా, కాదా ?...

ఎవడికి వాడు, వాడిమానాన 'నా దేవుణ్ణి ఏమైనా రాచి రంపాన పెడుతున్నానా, పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నానుకాని!' అనేవాడే...ఔను! 'వెయ్యితిట్లు ఒక్ష పూర్ణంబూరెతో సరికావు' అని అనుకుంటూండబట్టే ... నీ దేవుడు నీపాలిట పడి ఉన్నాడు!...అదే నీలో ఉన్న గొప్ప! అందుచేతనే నీ దేవుడు ఎప్పుడూ నీకు భక్తుడు :

(దేవుడూ మనిషివంటివాడే!—అని గట్టిగా అనుకునేందుకుకూడా వీల్లేనట్టు తోస్తూంది, చూడగా-చూడగా : మనిషివంటివాడైనా అయితే...మనిషికైనా లేని యిన్ని కడగళ్లు...మరి ?...)